1

# విలపించు విధవరాలు (1:1-11)

విలాపవాక్యములు 1:1-11లో చిత్రింపబడినట్టు, విలపించు విధవరాలుగా యెరూషలేము ఎలా ఉండేదో ఊహించి చూడు. రెండు దీర్ఘ సంవత్సరాల కాలం, శత్రు దేశము ఆ పట్టణం చుట్టు ముట్టడివేసింది. ఎవరును లోపలికి ప్రవేశించడానికి గాని బయటకు వెళ్లడానికి గాని అనుమతించబడలేదు. లోపల లభ్యమైన భోజనమంతా అయిపోయింది. ఆమె పిల్లలు ఆకలిగొనియున్నారు. స్నానం చేయడానికి చాలినంత నీళ్లు లేవు. త్రాగడానికి చాలిచాలనంతగా నీళ్లు ఉండిపోయాయి. క్షుద్బాధతో ఆమె పడకకు వెళ్లింది. నిదురించాలనే ప్రయత్నంతో పడక మీద అటూ ఇటూ పొర్లింది. ప్రతి రాత్రి అదే కథ.

ఆ విరామములేని రాత్రులలో ఒకదానియందు, అసాధారణమైన శబ్దము ఆమె శ్రద్ధను ఆకర్షించింది. దూరంలో జనుల గుంపు ఉల్లాసంగా ఉన్నట్టు వినిపించింది. ఆమె లేచి పడకమీద కూర్చొని ఉంది, అలజడి ఎక్కువైనట్టుంది. శబ్దాలు తప్పక మనుష్యుల చేత చేయబడేవే. అయితే వారు ఉల్లసించడం లేదు. వారి కేకలు ఏడ్పుగాను రోదనగాను వినిపించాయి.

అక్కడ ఏమి జరుగుతుందో తీర్మానించడానికి ఆమె తన చెవులకు శ్రమనిచ్చింది. అంతలో, ఒక మనుష్యుడు గంభీరంగా ఆజ్ఞలు జారీచేస్తున్నాడు. బూటుకాళ్ల శబ్దము భూమిమీద బలీయంగా పడడం బిగ్గరగా రూపొందింది. తట్టు కార్యక్రమం దగ్గరపడింది. త్వరలోనే, ఒక గుంపు దగ్గరకు చేరుకుంది, తన సొంత యింటి ద్వారమే తట్టబడుతుంది.

ఇంతలో తన కుమారులు (పిల్లలు) మేల్కొన్నారు, భయముతో నెమ్మదిగా దుఃఖించుతూ మాట్లాడుకొంటున్నారు. వణకుతో, ఆమె తలుపునొద్దకు వెళ్లింది. ఆమె కొంతసేపు తటపటలాడింది. మరోవైపునుండి బలీయమైన శబ్దంతో తలుపు తట్టబడింది. గడి తీయలేనంతగా ఆమె చేతులు వణకుతున్నాయి. గడి తీయలేకపోతుంది. ఎట్టకేలకు తలుపును తెరిచినప్పుడు, కోపోద్రేకియైన ఒక సైనికుని చేతిలోని ఖడ్గమునుండి రక్తము కారుతూ ఉండడం ఆమెకు కన్పించింది. అతడు ఆమె చెయ్యి పట్టుకొని వీధిలోనికి లాగాడు. ఇతరుల కొరకు వెదకడానికి అటుపిమ్మట అతడు ఆమె యింట ప్రవేశించాడు.

అట్టి విధవరాలి వ్యాకులతను నీవు ఊహించగలవా? ఆమె భర్త శత్రువుల చేతుల్లోనే చనిపోయాడు. బబులోనుకు విరోధంగా తిరుగుబాటు చేసినవారితో సహనిందితుడుగా అతడు చంపివేయబడ్డాడు. వారి పెద్ద కుమార్తె అందమైన స్త్రీగా వికసించుతూ రూపుదిద్దుకొంటుంది. ఆమె పిల్లలు యింకా చిన్నవారే, వారిలో ఒక బిడ్డ యింకను పాలు విడువలేదు. పిల్లల గతి ఎలాగుందో చూడగోరి యింటిలోనికి వెళ్లాలనే శోధన ఆ విధవరాలికి కలిగింది. తాను లేకుండ తన పసికూన సహాయంలేని స్థితిలో

నిలిచియుంటుంది! అయినా, తాను కదలలేకపోయింది. వీధిలో ఉన్న వందలకొలది బంధీలతో తాను గొలుసులతో కట్టబడియుంది. బంధీలలో కొందరు చాలీచాలని బట్టలతో ఉన్నారు, దాదాపు అందరు పాదరక్షలు లేనివారుగానే నిలిచారు.

దుమ్ముకొట్టుకొనియున్న వీధిలో జనులు జంతువుల గుంపులా ఉన్నారు. ఆ గుంపుతో కూడా కదలనివారు కొరడాతో కొట్టుబడుతున్నారు, లేదా ఖడ్గపు మొనలతో పొడవ బడుతున్నారు. ఆ విధవరాలు బిగ్గరగా ఏడ్చినట్టు విన్నది, వెంటనే అది తన గొంతులోనుండి వచ్చినట్టుగానే గుర్తించింది. ఆమె ఆవేదన వర్ణశక్యముగాక ఉంది. మెల్లని ఏడ్పు ఎక్కడో లోతైన తన ఆత్మలోనుండి వస్తూ ఉంది.

వీధిలోనున్న పదునైన రాళ్లు రక్తం కారునంతగా తన పాదాలను కోశాయి. ఆ వీధిలో జనులగుంపుతో కూడ కదలి, పట్టణపు గవిని వెలుపలికి వచ్చి, ఉత్తరానికి వెళ్లే రోడ్డుమీద నడిచిపోతుంది. గంటల తరబడి ఆమె నడిచింది. తన కుడివైపున పెద్ద అగ్ని గోళముగా సూర్యుడు దిజ్మండలమునుండి పైకి వస్తున్నాడు. తన వెనుక మరొక ప్రకాశమానమైనది ఉంది. తన పట్టణము, తన యిల్లు దహింపబడడంవలన ఏర్పడినదే ఆ వెలుగు! తన శిశువు! తన పిల్లలు! వారెక్కడున్నారు? అగ్నికి ఆహుతి కాకముందే వారు వెలుపలికి వచ్చియుంటారా? ఎక్కడైనా వారు ఆ గుంపులో ఉన్నారా? తాను వెళ్లి వారికొరకు వెదకాలని కోరుకుంటుంది, గాని తాను ఏమీ చేయలేదు. తాను యికనెన్నడు స్వతంత్రురాలు కాలేదని ఎరిగి హృదయంలో క్రుంగిపోయింది. బబులోను దేశపు క్రూరులైన అన్యజనులకు తాను బానిసయని ఎరిగి హృదయంలో క్రుంగిపోయింది. బబులోను దేశపు క్రూరులైన అన్యజనులకు తాను బానిస.

వెలుగు ఎక్కువయ్యింది, దానితో పరిచయమైన ముఖాలను చూడ వెదకింది. తాను గుర్తింపగల ఏ వ్యక్తి అందులో లేనందున ఆందోళన ఆరంభమయ్యింది. చిత్రహింసలకు గురిచేయబడినందున వస్తున్న పెడబొబ్బలకు చెవులు దిబ్బెళ్లు పడుతున్నాయి. అనేక దినాలుగా ఏ కొంచెం విశ్రాంతిగాని, తన పిల్లలను గూర్చిన ఆదరణ సమాచారంగాని ఆమె నోచుకోలేదు. దీర్ఘమైన, కఠోరమైన ప్రయాణం తన ఎదుటనున్నది. కొండలు, నదులు, దాటుకొంటూ, ఎడారి ఇసుక తిన్నెలు మీదుగా వెళ్లే ఎనిమిది వందల మైళ్ల దూరంలో తన నూతన నివాసం ఉండబోతుంది. ఈ ప్రయాణంలో బ్రతుకగల బలం తనకున్నట్టయితే – కాలినడకన ఆమె అక్కడికి చేరుకొంటుంది.

యెరూషలేముకు రూపకాలంకారంగా యిర్మీయా ఈ చెరగొని పోబడిన విధవరాలిని ఉపయోగించాడు. ఒకప్పుడు దేవుని పట్టణముగా పేరుమోసిన దాని గతిని యింకేది శ్రేష్ఠంగా చిత్రించగలదు? దేవుని ప్రజలమీదికి, వారి పట్టణంమీదికి, వారి దేశంమీదికి వచ్చిన వినాశనాన్ని యింకా ఏది శ్రేష్ఠంగా వర్ణించగలదు? యిర్మీయా తన కలాన్ని చేపట్టి యిలా రాశాడు:

> జనభరితమైన పట్టణము ఎట్లు ఏకాకియై దుఃఖాక్రాంతమాయెను? అది విధవరాలి వంటిదాయెను. అన్యజనులలో ఘనతకెక్కినది సంస్థానములలో రాచకుమార్తెయైనది ఎట్లు పన్ను చెల్లించునదైపోయెను? రాత్రియందు అది బహుగా ఏడ్చుచున్నది కన్నీరు దాని చెంపలమీద కారుచున్నది దాని విటకాండ్రందరిలో దాని నోదార్చువాడెవడును

లేదు దాని చెలికాండ్రందరు దాని మోసపుచ్చిరి వారు దానికి శత్రువులైరి. యూదా బాధనొంది దాసురాలై చెరలోనికి పోయియున్నది అన్యజనులలో నివసించుచున్నది విశ్రాంతినొందక పోయెను దాని తరుమువారందరు ఇరుకుచోట్ల దాని కలిసికొందురు. నియామక కూటములకు ఎవరును రారు గనుక సీయోను మార్గములు ప్రలాపించు చున్నవి పట్టణపు గుమ్మములన్నియు పాడైపోయెను యాజకులు నిట్టూర్పు విడుచుచున్నారు దాని కన్యకలు దుఃఖాక్రాంతులైరి అదియు వ్యాకులభరితురాలాయెను. దాని విరోధులు అధికారులైరి దాని శత్రువులు వర్థిల్లుచున్నారు దాని అతిక్రమము విస్తారమని యెహోవా దానిని శ్రమపరచుచున్నాడు. విరోధులు దాని పసి పిల్లలను చెరపట్టుకొని పోయిరి. సీయోను కుమారి సౌందర్యమంతయు తొలగిపోయెను. దాని యధిపతులు మేతలేని దుప్పులవలె ఉన్నారు. వారు బలహీనులై తరుమువారియందరి యెదుట నిలువలేక పారిపోయిరి. యెరూషలేము పూర్వకాలము తనకు కలిగిన శ్రేయస్సునంతటిని జ్ఞాపకము చేసికొనుచున్నది. దానికి కలిగిన శ్రమానుభవ కాలమునందు సంచార దినములయందు సహాయము చేయువారెవరును లేక దాని జనము శత్రువుచేతిలో పడినప్పుడు విరోధులు దాని చూచి విశ్రాంతి దినములనుబట్టి దాని నపహాస్యము చేసిరి. యెరూషలేము ఘోరమైన పాపముచేసెను అందుచేతను అది అపవిత్రురాలాయెను. దాని ఘనపరచిన వారందరు దాని మానమును చూచి దాని తృణీకరించుదురు. అది నిట్టూర్పు నిడుచుచు వెనుకకు తిరుగుచున్నది దాని యపవిత్రత దాని చెంగులమీద నున్నది దాని కడవరి స్థితిని అది జ్ఞాపకము చేసికొనక యుండెను అది ఎంతో వింతగా హీనదశ చెందినది దాని నెదరించువాడొకడును లేకపోయెను, యెహోవా, శత్రువులు అతిశయిల్లుట చేత నాకు కలిగిన శ్రమను దృష్టించుము. దాని మనోహరమైన వస్తువులన్నియు శత్రువుల చేతిలో చిక్కెను. నీ సమాజములో ప్రవేశింపకూడదని యెవరిని గూర్చి ఆజ్ఞాపించితివో ఆ జనమువారు దాని పరిశుద్ధస్థలమున ప్రవేశించి యుండుట అది చూచుచునే యున్నది. దాని కాపురస్థులందరు నిట్టూర్పు విడుచుచు ఆహారము వెదకుదురు. తమ ప్రాణ సంరక్షణ కొరకు తన మనోహరమైన వస్తువులు నిచ్చి ఆహారము వెదకుదురు, యెహోవా, నేను నీచుడనైతిని దృష్టించి చూడుము (విలాపవాక్యములు 1:1–11).

బబులోనుకు వెళ్లే ఆ దీర్ఘ ప్రయాణంనుండి యిర్మీయా తప్పించబడ్డాడు, కాని తాను ఎరిగిన అనేకులు తప్పింపబడలేదు. తన ప్రియమైన పట్టణము ముట్టడి వేయబడడం, కాల్చి వేయబడడం తాను చూచి దుఃఖించిన వారికంటె తక్కువగా దుఃఖించియుండడు. అతడు ఏడ్చి విలాపవాక్యాలను రాశాడు. యెరూషలేము ఒకప్పుడు ఎలాగుండిందో, నేడు తన పాపాన్ని బట్టి ఎలా చేయబడిందో యిది తెలుపుతుంది.

## గతంలో ఎలాగుండింది

ఒకప్పుడు యెరూషలేము ఎలా ఉండిందో విలాపవాక్యములు 1లో చెదురుమదురుగా కన్పిస్తుంది. ఒకప్పుడు ఎలా ఉండిందో గుర్తుకువచ్చినప్పుడు, దాని ప్రజల దురవస్థ అధికం చేయబడింది. ఒకప్పుడు పట్టణము జనభరితమై జనములలో ఘనతకెక్కినదై సంస్థానాలలో రాజకుమార్తెయై యుంది (1:1). పండుగలు ఆచరించడానికి యెరూషలేము లోనికి వచ్చు రోడ్లు జనముతో కిటకిటలాడుతూ ఉండేది. వచ్చివెళ్లే జనులతో గవునులు నింపబడి ఉండేయి (1:4). గత దినాలలో అది అనుభవించిన సౌభాగ్యం, ఆనందం వంటి కార్యాలను యిర్మీయా జ్ఞాపకం చేసికొన్నాడు. ఆమెను అతడు "సీయోను కుమారి"యని వర్ణించాడు (1:6, 7).

"గేదె చస్తేనేగాని పాలు బయటపడవు" లేదా "బావి ఎండిపోయేవరకు నీళ్లు అభినందింపబడవు" అని సామెత ఉంది. పోల్చి చూస్తే అనేక పాఠాలు నేర్చుకోవచ్చు. మనం అనుభవించే దీవెనలను పట్టించుకోకుండ తరచుగా అలక్ష్యం చేస్తాం. అవి ఉపయోగించబడేవరకు లేక మనయొద్దనుండి అవి తీసివేయబడేవరకు అలాటివి మనకు ఉన్నాయని కూడా గుర్తించియుండం. యెరూషలేము ప్రజల పరిస్థితి కూడా అట్టిదే. గతాన్ని జ్ఞాపకం చేసికొనడంతో ఈ పరిస్థితి మరీ చెడ్డదిగా మారిపోయింది. మార్గము తప్పి తిరిగిన జీవితపు తీవ్రమైన ఫలితాలు బాధాకరమైన జ్ఞాపకాలే. మనకు ఏమి ఉందో దాన్ని జ్ఞాపకం చేసికొన్నప్పుడు అది పోగొట్టుకొనడం భరించలేని కష్టంగా తోస్తుంది.

## తాను యిప్పుడు ఏమిగా మారిపోయింది

ఆర్థికపు క్షీణదశ, సాంఘీకపు అణచివేత అనేవి కలిగితేనే చాలినంత కీడుగా ఉంటాయి. యూదాకు కరవు కష్టకాలాలు ముందుగానే ఎదురయ్యాయి. కాని తన దేశంనుండి వెల్లగింపబడి శత్రు దేశము చేత అంతకు ముందు ఎన్నడూ కొనిపోబడలేదు. గతంలో అది అంతగా దోచుకొనబడి కొల్లగొట్టబడియుండలేదు. పూర్ణమైన యింతటి నిస్సహాయ స్థితికి, తనకు ప్రశస్తమును పవిత్రమునైయున్న సమస్తమును కోల్పోయిన స్థితిలోనికి దించబడలేదు.

*తాను సహాయములేని లేక ఆదరణలేనిదైయుంది.* 1వ అధ్యాయంలో నమ్మ శక్యముకాని నిరాశను నిరీక్షణలేని స్థితిని నాల్గు మారులు ప్రస్తావించుతూ, "దాని నాదరించువాడొకడును లేకపోయెను" అని యిర్మీయా వ్యక్తపరచాడు (1:2, 9, 17, 21). ఇతర సమయాలలో – యూదా, "విశ్రాంతి నొందకపోయెను" (1:3), "సహాయము చేయువారెవరును" లేకపోయిరని (1:7). సహాయములేక, నిరీక్షణలేక, ఆదరణలేక యూదా జనులు రాత్రియందు ఘోరంగా ఏడ్చారంటే ఆశ్చర్యపడనవసరం లేదు (1:2). ఏకాంతపు రాత్రులు విధవరాలికి బహు కఠినమైన రాత్రి కాలాలుగా ఉండేయి. రాత్రులు వస్తున్నాయంటేనే ఆమె భయపడిపోయేది. ప్రతి ఒక్కరు నిద్రపోతూ ఉండగా, తాను మాత్రం ఒంటరిగా వెక్కివెక్కి ఏడ్చుతుండేది.

*గతంలోని తన మిత్రులు శత్రువులుగా మారిపోయారు* (1:2). "దాని విటకాండ్రం దరిలో దాని నోదార్చువాడొకడును లేడు." "దాని విరోధులు అధికారులై దాని శత్రువులుగా వర్థిల్లుచున్నారు" (1:5). ఎదోము, ఐగుప్తు అను తన "గత ప్రేమికులు" నిజమైనవారు కాకపోయారు. బబులోను అణచివేతను వారి సహాయమువలన జయించవచ్చునని యూదా నమ్మిక ఉంచియుంది. వారి అభిమానాన్ని పొందడానికని యూదావారి దేవతలను సయితము పూజించింది. నిజంగా అవసరమైనప్పుడు, వారు సహాయంచేయ నిష్టపడలేదు. సరిగదా, దానికి కలిగిన ఆపదను బట్టి "దాని నపహాస్యము చేసిరి" (1:7). దాని మనోహరమైన వస్తువులన్నియు శత్రువుల చేతిలో చిక్కెను. జనులు తమ మనోహరమైన వస్తువుల నిచ్చి ఆహారాన్ని కొన్నారు (1:10, 11). తన మిత్రులే తనకు విరోధులుగా మారిపోవడం అవమానంలో హెచ్చయినది.

*తాను బలవంతముచేత పని చేయింపబడునదాయెను* (1:1). యూదా బాధనొంది

"దాసురాలై చెరలోనికి వెళ్లింది" (1:3). "విరోధులు దాని పిల్లలను చెరపట్టుకొని" పోయారు (1:5). "యూదా అన్యజనులలో నివసించుచు ... విశ్రాంతినొందక పోయెను" (1:3). ఒక జంతువువలెనో లేక ఆస్తివలెనో అది బబులోనుకు సొంతమయ్యింది. దానికున్న విలువ అంతా తన్ను సొంతం చేసికొన్న దేశానికి పనికత్తెగా మారడమే. ఇతరులు తనకు చేయడంలో ఆనందించిన విచారకరమైన హీనమైన పనులు చేయడానికి యూదా బలవంతపెట్టబడినదై తనకున్న ఆత్మ గౌరవమంతటిని ఊడదీయబడిన స్థితిలో అది కన్పించింది.

*వర్ణనాతీతంగా యూదా అవమానపరచబడింది* (1:8, 9). దాని మానము ప్రదర్శించబడింది. వేశ్య ఎంతగా శిక్షింపబడియుండేదో, అది అంతగా శిక్షింపబడింది. దాని అపవిత్రత దాని చెంగులమీదనున్నది. అది తన ముఖాన్ని కప్పుకుంటే ఆశ్చర్యపడనవసరముండదు. తానెవరో గుర్తించకుండ తన ముఖాన్ని కప్పుకొనునంతగా అది అవమానము చెందింది. అందరు చూచునట్టుగా తన నిజ స్థితి బయటికి కనుపరచబడింది. దేవుని జనముగా యూదా యికనెన్నడు నటన చేయలేదు. అది తన దేవునికి అపనమ్మకస్థురాలని సమస్త జనులకు ఎరుకచేయబడింది. తన భర్తకు అపనమ్మక స్థురాలైన భార్యవలె యూదా చూడబడింది.

*కాబోయే దాని నాయకులు పారిపోయారు* (1:6). రాజైన సిద్కియాయు అతని కుమారులును తప్పించుకొని పారిపోజూచియు, నెబుకద్నెజరు సైన్యంచేత పట్టబడిన సంగతిని యిది సూచించియుండవచ్చు (2 రాజులు 25:4–7). మేతలేని దుప్పులవలె ఉన్నట్టు వారు వర్ణింపబడ్డారు. అక్షరార్థంగా వారికి ఆహారం లేకపోయింది. ఆకలి చావులకు గురి కాకుండ వారు తప్పించుకోజూచారు. ఆహారపు కొరతతో బలహీనులుగా చేయబడిన వారు, తమ్మును తరుమువారి చేతికి సులభంగా దొరికారు.

రాజనగరులో పనిచేయునట్లు గతములో బబులోనుకు కొనిపోబడిన రాజ వంశీయులకు కూడా ఈ కామెంట్స్ సూచింపవచ్చు. వారిలో దానియేలు, హనన్యా, మిషాయేలు, అజర్యా అనువారు ఉన్నారు (దానియేలు 1:1–7).

*దాని కన్యకలు దుఃఖాక్రాంతులైరి* (1:4). ఏ దేశము యొక్క భవిష్యత్తు అయినా దాని యువత మీద ఆధారపడియుంటుంది. యూదా దేశపు యువతరము బంధీలుగానైనా కొనిపోబడి యుండాలి లేక చంపబడియైనా ఉండాలి. యౌవన స్త్రీలు ఆ దేశానికి కాబోయే భార్యలుగాను తల్లులుగాను ఉండవలసినవారు, చెరగొనిపోబడి అవమానపరచబడ్డారు, అపవిత్రపరచబడ్డారు.

## సందేశమేమి?

నీవెప్పుడైన పాపముపై ఆవేదనను అనుభవించియుంటావా? లేకుంటే, నీవు పొందవచ్చు. పాప సంబంధమైన నీ స్థితిని గుర్తించడానికి – ఆలాటి అనుభవం నీకు అవసరమైయుండవచ్చు. పతనమైన యూదా యొక్క చిత్రం – అపవిత్రుడు, దేవుని ఎదుట నలిగిన వ్యక్తియొక్క నిజమైన రూపచిత్రమైయుంది. నీవు ఆ పరిస్థితిలో ఉన్నట్టయితే, ఈ క్రింది సూచనలు సహాయపడతాయి.

(1) *దేవుని మహా ఘనతను గుర్తించి అభినందించు.* మన దీవెనలకు మూలమైన ఆయనను గుర్తించుటలో తప్పిపోయినప్పుడు, మనము వాటికి పాత్రులమనుకొని వాటిని అధికారపూర్వకంగా కోరతాం. స్వార్థపరులమై ఎన్నటికిని తృప్తిపొందం. శరీరం యింకా అధికంగా కావాలని కోరుతుంది.

జాన్ అనే వ్యక్తిని గూర్చి ఒక కథ చెప్పబడింది. ఒక రోజు పార్కులో బెంచీ మీద కూర్చుండి వికసించిన పుష్పాలను, పక్షుల కూతలను, ఉపశమనము కలిగించు వసంతకాలపు పరిమళమైన గాలిని అతడు అనుభవిస్తూ (ఎంజాయ్ చేస్తూ) ఉన్నాడు. అంతలో, మంచి దుస్తులు ధరించిన ఒక వ్యక్తి తనవైపుకు నడుస్తూ వచ్చి, కొంత డబ్బు తన చేతికి యిచ్చి వెళ్లిపోయాడు. అతడు మూల తిరిగిన తరువాత కన్పించకుండ పోయాడు. డబ్బు యిచ్చినప్పుడు ఒక మాటయైనా చెప్పలేదు. జాన్ దిగ్భ్రమచెందాడనుకో.

మరునాడు అదే సమయానికి జాన్ తిరిగి ఆ పార్కు బెంచ్ వద్దకు వచ్చాడు. మర్మమైన ఆ మనుష్యుడు జాన్ నొద్దకు వచ్చి డబ్బు చేతికిచ్చి, మారుమాట లేకుండానే వెళ్లిపోయాడు. జానుకు ఆశ్చర్యం కలిగింది. ఆ మనిషి ఎవరు? తనకు డబ్బు ఎందుకు యిస్తున్నాడు?

మరు దినాన జాన్ ఆ బెంచ్‌మీద కూర్చున్నాడు. బహు నిశ్చయంగా, అదే మనిషి తనవైపు నడుచుకొంటూ, గత రెండు రోజులవలెనే వచ్చాడు. ఎదురుచూపులో జాన్ తన చెయ్యి చాపాడు; అయితే ఈసారి, ఆ మనిషి ఆగకుండ వెళ్లిపోయాడు. అప్పుడు జాన్ లేచి, ఆ మనిషి వెంట పరుగెత్తి, "నా డబ్బు ఎక్కడ?" అని అడిగాడు. అతడు ఆగకుండగనే, "నేను నీకు ఏమీ వాగ్దానం చేయలేదే" అంటూ ముందుకు సాగి మరల అదృశ్యుడయ్యాడు.

ఆ వింత మనిషి తనకు డబ్బు యిస్తున్న కారణాన్ని ఎరుగక ఆశ్చర్యపడినా, ఆ డబ్బును అతడు నిజముగా అభినందించలేదు. దాన్ని పొందే ఏ యోగ్యతా అతనికి లేకపోయినా, దాన్ని ఎదురుచూడసాగాడు. దేవుని దీవెనల విషయములో మనం అలాటివారమై ఉండవచ్చు. దేవుని యొద్దనుండి దేనిని పొందే అర్హత కూడ మనకు లేదు. ఆయన మనకు ప్రసాదించినవి తప్ప సొంతమైనది ఏదీ మనకు లేదు. కొంతకాలం ఆయన మనకు అప్పుగా యిస్తున్నాడు. ఆయనే వాటికి మూలమైయున్న సంగతిని మనము గుర్తించి, కృతజ్ఞతాస్తుతులు చెల్లింపక పోయినట్టయితే, ఆయన ఉద్దేశాలకొరకు మహిమకొరకు వాటిని వినియోగించనట్టయితే, మనకు అవసరము లేనివాటిని సహా కావాలని మనం కోరుతూ ఉంటాం. పరిస్థితి అంతకంటె నీచ స్థితికి దిగజారి, మనం కోరినవాటిని దయచేయనందుకు దేవుని నిందించడానికి పూనుకుంటాం. దీనికి ఫలితంగా, ఆయనకు అపనమ్మకస్థులమై, మనకు కావలసినవాటిని వేరు మూలములనుండి పొంద ప్రయత్నిస్తాం. తాను కోరుకున్నవాటిని పొందడానికి గాను, యూదా ఎదోమును, ఐగుప్తును తన విటకాండ్రనుగా చేసికొంది.

(2) *నీ కార్యములకు దేవుని యెదుట లెక్క చెప్పువానిగా నిలిచియుండు.* విలాప వాక్యములంతటను, యూదా యొక్క దుస్థితికి కారణాన్ని యిర్మీయా మాటిమాటికి సూచించాడు: "దాని అతిక్రమము విస్తారమని యెహోవా దానిని శ్రమపరచు

చున్నాడు" (1:5); "యెరూషలేము ఘోరమైన పాపము చేసెను అందుచేతను అది అపవిత్రురాలాయెను" (1:8); "దాని యపవిత్రత దాని చెంగులమీదనున్నది. దానికడవరి స్థితిని అది జ్ఞాపకము చేసికొనక యుండెను" (1:9); "నీ సమాజములో ప్రవేశింపకూడదని యెవనిని గూర్చి ఆజ్ఞాపించితివో ఆ [అన్య] జనములవారు దాని పరిశుద్ధ స్థలమున ప్రవేశించి యుండుట అది చూచుచునే యున్నది" (1:10).

"జరిగిపోయిన దానిని దేవుడు మరల రప్పించును" (NIV) అని ప్రసంగి 3:15లోని చివరి భాగమంటుంది. లైంగిక పాపాన్ని గూర్చి మాట్లాడుతూ, "మేము పూర్వము మీతో చెప్పి సాక్షమిచ్చిన ప్రకారము ప్రభువు వీటన్నిటి విషయమై ప్రతిదండన చేయువాడు" అని 1 థెస్స. 4:6 బయలుపరచుతుంది. లేఖనములో చివరి భాగము దేవుని గూర్చిన మరొక ప్రాముఖ్యమైన సత్యాన్ని తెలియజేస్తుంది: పర్యవసానాలను గూర్చి ముందుగానే ఎల్లప్పుడు హెచ్చరిక చేస్తూ, తనయొద్దకు తిరిగి రమ్మని ఆయన పిలుపునిస్తాడు. వారి అవిశ్వాస్యతకు ఫలితముగా వచ్చు పర్యవసానాల విషయమై ఆయన పలుమార్లు యూదాను, యెరూషలేమును హెచ్చరించాడు. దేవుని పక్షంగా మాట్లాడేవాని మాటలు వినడానికి బదులు, ప్రవక్తనే లేకుండ చేయాలని వారు ప్రయత్నించారు.

నోవహు దినములలో, నోవహు నీతిని ప్రకటించుచుండగా (2 పేతురు 2:5), దేవుడు 120 సంవత్సరాలు ఓరిమి కలిగియున్నాడు (ఆది. 6:3). మానవ కాఠిన్యము, మూర్ఖమైన వారి తిరుగుబాటు యొక్క మానని పరిస్థితిని దేవుడు కనుగొనినప్పుడు. దేవుడు అప్పటి లోకం మీదికి తన తీర్పును తెచ్చాడు.

దేవుని తీర్పు ఎల్లప్పుడు నీతిననుసరించియుంటుంది (అపొ. 17:31), అంటే, జరిగించిన పాపానికి తగినట్టు ఆయన తీర్పు ఉంటుంది. యూదా మీద ఆయన తీర్పు కఠినమైనదని మనం తలంచినట్టయితే, వారి పాపముల యొక్క తీవ్రతను గూర్చి మనం తిరిగి చూడవలసియుంటుంది. లెక్కలు చూచే దినంవరకు అపరాధములు ఎలాటివై ఉన్నాయో మనుష్యులు అరుదుగా గుర్తిస్తారు.

దేవుని యెదుట బాధ్యతను అంగీకరించడం అంటే, తప్పుగా కోరుకున్నవాటికి ఫలితాలుంటాయని అర్థం. అలాటి గ్రహింపు మంచివాటిని కోరుకునేలా మనకు సహాయ పడుతుంది. బాధ్యత కలిగియుండడమంటే, మనం తప్పు లేక చెడ్డవాటిని కోరుకున్నప్పుడు, మనం మన తప్పులను ఒప్పుకొని, దేవుని యెదుట మనలను మనం తగ్గించుకొని, ఆయన క్షమాపణను వేడుకొనడం అనే అర్థం కూడ వస్తుంది.

(3) *ఇతరులపై నీ ప్రభావము యొక్క బాధ్యతను అంగీకరించు.* ఇతరులమీద నీ ప్రభావముంటుంది. మనం సరియైనవాటిని కోరుకున్నప్పుడు, ఆ మార్గాన యితరులు కూడా రావాలని వారిపై మన ప్రభావాన్ని కనుపరచుతాం. ఇలాటివారిలో మనలను ప్రేమించేవారు ఎక్కువగా ఉంటారు. మనం కోరుకున్నవాటిచే ఎక్కువ ప్రభావానికి గురి చేయబడేవారు పిల్లలైయుంటారు.

చిన్న పిల్లలలో మృతులైనవారు అదృష్టవంతులైనా, యూదాపై బబులోను చేసిన దాడిలో శిశువులు వధింపబడడమనే దాని పర్యవసానాన్ని గూర్చి యిర్మీయా డీల్ చేయవలసి ఉంది. ఇతరులు తమ తల్లిదండ్రుల చంకలలోనుండి లాగివేయబడి

బానిసత్వానికి అమ్మబడ్డారు. పడుచువారిలో కొందరు మానభంగం చేయబడి, దుర్వినియోగపరచబడ్డారు.

పిల్లల శ్రమ, మన సొంత పిల్లల శ్రమ, మన పాప ఫలితాలలో ఒకటై ఉంటుంది. మీ పిల్లలకు దైవికమైన మార్గదర్శకత్వమిమ్ము. నీ జీవితమువలనను, బోధవలనను దేవునితో వారికి పరిచయము కలిగించు. వెండి బంగారముల కంటె శ్రేష్ఠమైన స్వాస్థ్యము నిమ్ము: మంచిపేరు వారికిమ్ము (సామెతలు 22:1; ప్రసంగి 7:1). వారికొరకు నీతిమార్గాన్ని సిద్ధపరచు. కలవరమైన నీళ్లమీదుగా వారికొరకు వంతెనలను కట్టు.

కోరుకొనడమనేది నీ స్వాధీనం చేయబడియుంది. దాన్ని సద్వినియోగం చేయడానికి నీకు సమయం అనుగ్రహించబడియుంది. ఆలస్యం కాకముందే ప్రభువైన యేసువైపు తిరుగు.

---

## విధవరాలి యొక్క దురవస్థ

విధవరాండ్రు, ప్రత్యేకించి కుటుంబాలు లేని విధవరాండ్రకొరకు దేవుడు ఎల్లప్పుడు ప్రత్యేకమైన ఏర్పాట్లు చేస్తూనే వచ్చాడు. నాయీను అను గ్రామంనుండి వెలుపలికి వస్తూ, ఒక సందర్భంలో, తాను కలిసికొన్న విధవరాలిపై జాలిచేత ప్రభువైన యేసు కదిలింపబడ్డారు. తనకు ఒక్కడైయున్న కుమారుని పాతిపెట్టడానికి ఆమె వాని తీసికొనిపోతుంది. “ఏడువవద్దు” అని ఆయన ఆమెతో చెప్పారు. చిన్నవాడా, లెమ్మని నీతో చెప్పుచున్నాననగా, ఆ చనిపోయినవాడు లేచి కూర్చుండి మాటలాడసాగెను. ఆయన అతనిని అతని తల్లికి అప్పగించెను (లూకా 7:11–15). మనస్సు కరిగించెడు ఈ ఉదాహరణకు తోడు, దిక్కులేని వారిని, విధవరాండ్రను వారి యిబ్బందిలో పరామర్శించు మని ఆది సంఘమునకు చెప్పబడింది (అపొ. 6; 1 తిమోతి 5:3–16; యాకోబు 1:27).

పిల్లలు లేకుండ దురవస్థను అనుభవించిన విధవరాండ్ర కథలలో, మోయాబీయురాలైన రూతు, యూదురాలైన తన అత్తయగు నయోమిల వర్ణన కన్పిస్తుంది. తన విశ్వాస్యతను బట్టి, దేవుడు రూతును ఆశీర్వదించాడు. ఆమె నయోమిపట్ల ఎంతో ప్రేమను, భక్తిని కనుపరచింది. (రూతు గ్రంథం చూడు.)

యూదయ దేశపు నాగరికతలో, భర్తను బిడ్డలను పోగొట్టుకున్న విధవరాండ్రు బహుగా కనికరము పొందారు. భర్త లేకుండ, ఆమెకు ఆదాయముండదు. పిల్లలు లేకుండ, తాను వారసత్వము కూడా లేనిదైయుంటుంది. అందువలన, ఆమె అర్థికపరంగా ఏమీ లేనిదై ఉంటుంది. సమస్తాన్ని కోల్పోయిన విధవరాలికంటె దుఃఖకరమైనది మరేదీ ఉండదు. ఈ విధంగా, యెరూషలేము యొక్క దుఃఖ జనికమైన స్థితిని వర్ణించడానికి యిర్మీయా సర్వాన్ని కోల్పోయిన విలపించు విధవరాలితో పోల్చాడు. “జనభరితమైన పట్టణము ఎట్లు ఏకాకియై దుఃఖాక్రాంతమాయెను? అది విధవరాలివంటిదాయెను ...” (విలాప వాక్యములు 1:1).